క్లుప్తంగా

తాగునీటి కోసం రాస్తారోకో



నీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

పుల్లలచెరువు: తమ నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పుల్లలచెరువు మండల కేంద్రంలోని అంజనాపురం కాలనీవాసులు గురువారం రోడ్డెక్కి రాస్తారోకో చేశారు. తమకు తాగునీరు లేక చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు స్పందించి తమకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కాలనీవాసులు కొంతసేపు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు నిలిచి పోయాయి.

వివాహ వేడుకకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్



వివాహ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు(దర్శి): మండలంలోని రెడ్డినగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు మేడగం రమణారెడ్డి కుమార్తె వివాహ వేడుకకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. పెండ్లికుమార్తెను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పది మంది చిన్నారులకు ఫిజియోథెరపీ



పెద్దారవీడులో చిన్నారులకు చికిత్స చేస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

పెద్దారవీడు: స్థానిక ఎంపీపీ (డిపెప్) పాఠశాలలోని భవిత కేంద్రంలో డాక్టర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం పది మంది చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇంటి వద్ద క్రమం తప్పకుండా చిన్నారులతో వ్యాయామం చేయిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచించారు. చిన్నారులను క్రమం తప్పకుండా శిబిరానికి తీసుకురావాలని, ఫిజియోథెరపీ చేయిస్తే నరాల బలహీనత తగ్గి చచ్చుబడిన కండరాల్లో చలనం వస్తుందని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీఎస్ డీ బీబీ, డి.బాలవర్ధిరాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

త్రిపురాంతకం: విద్యార్థులు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివబసవరాజు సూచించారు. త్రిపురాంతకం మండలం రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బాగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటికి బానిసలు కావద్దని విద్యార్థులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై అతి వేగంతో వెళితే ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నిరోధించేందుకు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు వెళ్లే దారేదీ..?

- రోడ్డుకు అడ్డంగా మట్టికట్టలు వేయడంతో నిలిచిన మురుగునీటి ప్రవాహం
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న ఐనముక్కల వాసులు



మట్టికట్టలు వేయడంతో నిలిచిన మురుగునీరు



ఆంజనేయస్వామిగుడి బజారులో...

పెద్దదోర్నాల:

మండలంలోని ఐనముక్కలలో మురుగు నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవటంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులైన రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వీధితో పాటు అంజనేయస్వామి గుడి వీధిలో మురుగునీరు వెళ్లే దారి లేక జలమయంగా మారింది. దీంతో ఆయా వీధుల్లో మురుగునీటితో పాటు వర్షం నీరు కూడా చేరడంతో ఆయా వీధుల్లో నివాసం ఉండేవారు దోమలతో సహజీవనం చేస్తున్నామని వాపోతున్నారు. గ్రామంలోని ఆయా వీధులలో మురుగునీరు వెళ్లకుండా కొందరు అడ్డుకట్టలు వేయటంతో వర్షం నీరు, మురుగునీరు అక్కడే నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధులు ప్రబలి అవస్థపడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీటి సమస్య ఉత్పన్నమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎలక్షన్ల సమయంలో కాలువలు, సిమెంటు రోడ్డు వేస్తామని రాజకీయ నాయకులు ఉత్తుత్తి హామీలిచ్చి ఓట్లు వేయించుకుంటారే తప్ప అనంతరం తమ సమస్యలు వారికి పట్టడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామానికి చెందిన రాజకీయ నేతలు, పంచాయతీ అధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి కట్టలు తొలగించాలని స్థాని

మురుగునీటితో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి : దీర్ఘకాలంగా మురుగునీరు నిలిచి ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. కాలువలు కూడా నిర్మించాలి.



– చిట్యాల వెంకటరెడ్డి, ఐనముక్కల

మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : గ్రామంలో నిలిచిన మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురుగునీటి నుంచి ఇళ్లలోకి పురుగులు చేరుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. స్థానిక అధికారులు పట్టించుకోవాలి. లేకుంటే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.



– అల్లు వెంకటేశ్వరరెడ్డి, ఐనముక్కల

నేల స్వభావం మేరకే ఎరువులు వాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో నిర్మలాదేవి



పెదన్నపాలెం రైతులతో మాట్లాడుతున్న ఏపీ



మాట్లాడుతున్న అబ్దుల్ సతార్

పుల్లలచెరువు: గ్రామాల్లోని రైతులు తమ పొలాల నేల స్వభావం మేరకే ఎరువులు వాడుకోవాలని వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. గురువారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా స్థానిక ఏవో కార్యాలయంలో రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు పంటలు వేసే సమయంలో తప్పనిసరిగా నేల స్వభావాన్ని పరిశీలించుకుని సాగుచేయాలన్నారు. దీని వలన పంటలకు నష్టం జరగకుండా ఉండటంతో పాటు పెట్టుబడి తక్కువ అవుతుందని, ఏ పంటకు ఎలాంటి ఎరువులు వాడుకోవాలో తెలుస్తుందని అన్నారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వలన భూమి భౌతిక లక్షణాలు కోల్పోయి దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. సేంద్రియ కర్బనం నేలకు అందించి భూమిలో పోషకాల లభ్యతను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నేల సంరక్షణ మనందరి బాధ్యత

దొనకొండ: నాణ్యమైన పంటలు పండాలంటే నేల ఆరోగ్యంగా ఉంటేనే సాధ్యపడుతుందని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పెదన్నపాలెం రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేల ఆరోగ్యం మనందరి బాధ్యత పేర్కొన్నారు. పంటలు దిగుబడి పెరగాలన్నా, నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించాలంటే భూమిని కలుషితం చేయరాదని, అవసరమైన మేరకే రసాయనిక ఎరువులు వాడాలని సూచించారు. సేంద్రీయ ఎరువులను వాడితే భూసారం పెరిగి మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు లభ్యమవుతాయన్నారు. రైతులకు మట్టి నమూన ఫలితాలను వివరించి, దాన్ని అనుసరించి మాత్రమే ఎరువులు వాడాలన్నారు. ఎంత ఎక్కువగా ఎరువులు వేస్తే అంత ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. నేల ఆరోగ్యం కాపాడుతామని, జాగ్రత్తగా చూసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవితేజ, యోగేశ్వరరావు, వీణాకుమారి, రైతులు పాల్గొన్నారు.

దర్శి: నేల ఆరోగ్యంగా ఉంటేనే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ సహాయకుడు అబ్దుల్ సత్తార్ సూచించారు. మండలంలోని రాజంపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ నేల ఆరోగ్యం మెరుగు పడినప్పుడు నీరు మరింత సమర్ధవంతంగా మొక్కలకు అందుతుందన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి పశువుల ఎరువులు ఎక్కువగా వాడటం అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. నేల పరీక్షలు, నేల ఆరోగ్యంపై మట్టి పరీక్షలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమూల్యమైన సహజ వనరు.. నేల

పెద్దదోర్నాల: నేల అనేది అమూల్యమైన సహజ వనరని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ కొనియాడారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని మనం కాపాడగలిగితే మానవునికి మంచి జరుగుతుందన్నారు. ప్రస్తుతం రైతులు రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల నేల ఆరోగ్యం పాడవుతోందన్నారు. భూసార ప్రాముఖ్యత, భూసార పరీక్షలు, మట్టి సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి చేపట్టాలని, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మట్టి నమూనా పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ చైతన్యకుమార్, వీఏఏ విశ్వనాథ్, శివానాయక్, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: నేలల ఆరోగ్యం కాపాడటం చాలా అవసరమని కృషి విజ్ఞానకేంద్రం హెడ్ డాక్టర్ జి.రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా ఆయన మండలంలోని గొల్లపాలెంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యం కాపాడుకోవాలంటే ముఖ్యంగా రైతులు పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని భూమిలో కలియదున్నాలన్నారు. రసాయనికి ఎరువుల వాడకాన్ని తగ్గించి పశువుల ఎరువులు, జీవన ఎరువులను ఎక్కువగా వాడుకోవాలని సూచంచారు. శాస్త్రవేత్త టి. మానస, నాగభూషణం, జీహెచ్ నారాయణ, కేవీకే సిబ్బంది, బీఏఐఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.



రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

అనాథలకు అండగా నిలవడం అభినందనీయం



మాట్లాడుతున్న సీఐ రామారావు

దర్శి: అనాథలకు అండగా నిలవడం అభినందనీయమని సీఐ రామారావు అన్నారు. మండలంలోని చలివేంద్ర గ్రామ పరిధిలోని వెంకటాచల క్షేత్రంలోని కాశీనాయన వృద్ధాశ్రమంలో పలువురు వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ మానవత్వంతో అనాథలకు ఆరోగ్య పరీక్షలు చేయించి వారికి అండగా నిలిచిన మానవత సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. వారికి ఆరోగ్య పరీక్షలు చేయడమే కాక వృద్ధాప్యంతో మృతి చెందిన అనాథలకు దహన సంస్కారాలు కూడా చేస్తున్నారని అభినందించారు. ఇలాంటి స్వచ్ఛంద సంస్థలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సీహెచ్‌సీ సూపరింటెంట్ డాక్టర్ సుమన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వృద్ధాప్యంలో వృద్ధులు ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యం మెరుగుపడేందుకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో మీనాక్షి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మల్లారెడ్డి, డీపీఎంఓ డాక్టర్ సుబ్బారెడ్డి, మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ గొర్రెపాటి వేణు, విశ్రాంత తహసీల్దార్ వెంకటేశ్వర్లు, దారం వాసుదేవరెడ్డి, జె.సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడి పూజ



పాల్గొన్న మాలధారులు, భక్తులు



పూజలు చేస్తున్న గురుస్వామి, ఉభయదాతలు

పెద్దదోర్నాల: హరిహరసుతుడు అయ్యప్పస్వామి పడి పూజను పెద్దదోర్నాల మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గురుస్వామి సాంబశివ రావు ఆధ్వర్యంలో వేకువజామున సుప్రభాతసేవ, గణపతి హోమం, కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. నవగ్రహ, సుబ్రహ్మణ్య, లక్ష్మీగణపతి, రుద్ర, పూర్ణాహుతి, మహారుద్రాభిషేకాలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి తేనె, పండ్లు, గంధం, పసుపు, కుంకుమ, చక్కెర, భస్మం, పన్నీరు, పూలు, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా ముత్యాభిషేకం, కనకాభిషేకాలను వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామివారి నవగ్రహపూజ, అభిషేకం, వింజామరసేవ ఉభయదాతలుగా ఈ పూరి సుబ్బారావు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఆలయాన్ని ప్రత్యేక పూలమాలతో, రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ సింహద్వారంలోని 18 మెట్లకు మంత్రపరిమళ పుష్పాలు, కళశాలతో పడి అలంకరణ చేశారు. స్వామియే శరణమయ్యప్ప అనే శరణుఘోషతో ఆలయం మార్మోగింది. అయ్యప్ప స్వామి భక్తులు స్వామివారిని దర్శించుకుని భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. పడి పూజ సందర్భంగా హాజరైన భక్తులందరికీ ఆలయ కమిటీ సభ్యులు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో పందు స్వామి, శ్రీనివాసాచారిస్వామి, తిరుమలరెడ్డి జగదీశ్వరరెడ్డి, నారాయణస్వామి, వేణుస్వామి, అలయ ధర్మకర్త బొగ్గరపు మణికంఠ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి



గొబ్బూరులో భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పెద్దారవీడు: ఆధార్ తరహాలో అపార్ వివరాల నమోదును వేగవంతం చేయాలని ఎంఈఓ పి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గొబ్బూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల వివరాలు పొందుపర్చాలని, వారికి ఆధార్ తరహాలో అపార్ కార్డును ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వివరాలు సక్రమంగా ఉన్న విద్యార్థులకు సంబంధించిన అపార్ జనరేషన్ వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. వంట తయారు చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

భారీగా బెల్లం ఊట ధ్వంసం



పుల్లలచెరువు: బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పుల్లలచెరువు: మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా పరిధిలో ఎక్సైజ్ అధికారులు గురువారం నిర్వహించిన దాడుల్లో భారీ ఎత్తున బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. మొత్తం 600 లీటర్ల బెల్లం ఊటను కనుగొని ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

కలనూతల సమీపంలో మరో 600 లీటర్లు ధ్వంసం...

పెద్దారవీడు: మండల పరిధిలోని కలనూతల గ్రామ సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం అందడంతో ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్, ఎస్టీ హెడ్ కానిస్టేబుల్ మాల్యాద్రి గురువారం దాడి చేశారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కుండలు, డమ్ముల్లో ఉన్న 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

చిన్ననాటి నుంచే ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ హాల్ టికెట్లు అందిస్తున్న ఉప విద్యాశాఖాధికారి శ్యామూల్‌జాన్

పెద్దారవీడు: విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతాశయంతో ఎదగాలని మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బి.శ్యామూల్‌జాన్ సూచించారు. మండలంలోని ఓబులక్కపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల హవిల నోట్‌బుక్ పరిశీలించి చక్కని చేతిరాతను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు పటిష్ట ప్రణాళికతో విద్యనభ్యసించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు 100 రోజుల యాక్షన్ ప్లాన్ (స్టడీ అవర్స్) చక్కగా ఉపయోగించుకోవాలని, మంచి ఫలితాలు సాధించేలా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. 8వ తేదీ జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు హాల్ టికెట్లు అందించి మంచి ఫలితాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వీసీ వెంకటేశ్వర్లు, సీనియర్ ఉపాధ్యాయురాలు ప్రసన్నదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

దర్శి: మండలంలోని ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో గ్రామాల్లోని క్షేత్రపరమైన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. 6వ తేదీ శుక్రవారం బండి వెలిగండ్ల, కట్టశింగన్నపాలెం, 9వ తేదీ రామచంద్రాపురం, 10వ తేదీ వెంకటాచలంపల్లి, 11వ తేదీ చందలూరు, బసిరెడ్డిపల్లి, 12వ తేదీ పోతకమూరు, పాపిరెడ్డిపాలెం, 13వ తేదీ బొట్లపాలెం, తూర్పువీరాయపాలెం, 17వ తేదీ రాజంపల్లి,గణేశ్వరపాడు, 18వ తేదీ సామంతపూడి, కొర్లమడుగు, 19వ తేదీ దేవవరం, 20వ తేదీ తిమ్మాయిపాలెం, తానంచింతల, 21 దర్శి తహశీల్దార్ కార్యాలయం, 24వ తేదీ తూర్పు చౌటపాలెం, 26వ తేదీ తూర్పు వెంకటాపురం, 27 యర్రోబనపల్లి, అబ్బాయిపాలెం, 28వ తేదీ కొత్తపల్లి, 31వతేదీ జముకులదిన్నె, రాజంపల్లి, జనవరి 2వ తేదీ లంకోజనపల్లి, 3వ తేదీ చెర్వుకొమ్ము పాలెం, తూర్పువీరాయపాలెం, 4వ తేదీ పోతవరం, 7వ తేదీ కొర్లమడుగు, తుమ్మెదలపాడు, 8వ తేదీ పెద్ద ఉయ్యాలవాడ, చిన్న ఉయ్యాలవాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

దొనకొండ: మండలంలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మీ గ్రామాల్లోనే రెవెన్యూ సిబ్బంది ఉంటారన్నారు. 6వ తేదీ తెల్లబాడు, 7న వద్దిపాడు, 9న కలివెలపల్లి, 10న సంగాపురం, 11న పడమటి వెంకటాపురం, 12న బాదాపురం, 13న వీవీపురం, 16న యర్రబాలెం, 17న గుడిపాడు, 18న నరసింహనాయునిపాలెం, 19న చందవరం, బట్టేపాడు, 20న కొచ్చెర్లకోట, 21న పోలేపల్లి, 23న రామాపురం, 24న మల్లంపేట, 26న మంగినపూడి, 27న భూమనపల్లి, 28న పడమటి కంభంపాడు, 30న పెదన్నపాలెం, 31న ఆరవల్లిపాడు, జనవరి 2న అనంతవరం, 3న ఇండ్లచెరువు, 4న రాగమక్కపల్లి, 6న రుద్రసముద్రం, 7న సిద్ధాయపాలెం, 8న లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు మీ రెవెన్యూ సమస్యలు గ్రామసభలో పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

పుల్లలచెరువు: నేటి నుంచి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 6వ తేదీ యండ్రపల్లి, 7న పెద్ద పీఆర్‌సీ, 9న రజాములతండా, 11న మల్లాపాలెం, 12న కోమరోలు, 13న రాచకొండ, 17న చాపలమడుగు, 18న నాయుడుపాలెం, 19న మర్రివేముల, 20న శతకోడు, 21న ముటుకుల, 24న ఐటీ వరం, 27న గంగవరం, 28న పుల్లలచెరువు, 31న మానేపల్లి, జనవరి 7న కవలకుంట్ల, 8న చౌటిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.